

ఐఏపీ వీవోఏ జిల్లా కమిటీ


రమ

ఆసిఫాబాద్, జనవరి 28: ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా రమ, ప్రధానకార్యదర్శిగా జ్యోతి, కోశాధికారిగా సునీత, ఉపాధ్యక్షు లుగా సంతోష్, అనిల్, రోజ, హమాజీ, సహాయ కార్యద ర్శులుగా స్వప్న, ఆనంద్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, దత్తు, తిరుపతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐ టీయూ నాయకులు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన.. మామిడి చెట్టు


ఆకులు కనిపించనంతగా పూచిన మామిడి చెట్టు

పెంచికలపేట, జనవరి 28: ఏదో చెట్టును అందమైన పూలతో అలకరించినట్లు ఉందికదా ఈ ఫొటో. అవిపూవులే. కానీ అలంకరణ కోసం ఏర్పాటు చేసిన పూలుకాదు. అదంతా మామిడిపూత. పెంచికలపేట మండలం ఎల్లూరుగ్రామానికి చెందిన చప్పిడి రవి ఇంటిఆవరణలో ఉన్న మామిడిచెట్టు ఇలా ఆకులు కూడా కనిపించనంతగా విరగబూసింది.ఈ చెట్టుకు ఇంతపూత ఎప్పుడూ రాలేదని రవి చెప్పాడు.

బీబ్రాలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

దహెగాం, జనవరి 28: మండలంలోని బీబ్రా గ్రామంలో ఆదివారం బండ భవాని స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడానైపుణ్యాన్ని పెంచుకోవడంతోపాటు యువత క్రీడల్లో రాణించాలన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొం దుతుందన్నారు. శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. క్రీడలు మానసికుల్లాసాన్ని కలుగజేస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

- నిఘా పెంచిన అధికారులు
- ఇంకా ఆచూకీ లభించని రెండు పులులు
- అధికారికంగా ప్రకటించని అధికారులు



పులుల కోసం కొనసాగుతున్న అన్వేషణ

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 28: కాగజ్‌నగర్ దరిగాం అటవీ ప్రాంతంలో పులుల మృత్యువాత తర్వాత రాష్ట్ర అటవీ అధికారులు తేరుకొని పులుల జాడ కోసం అన్వేషణ ప్రారంభించారు. పదిహేను రోజుల నుంచి అటవీ ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో వేణుబాబు, ఎఫ్ఆర్‌వో సట్ల వేణుగోపాల్, ఎఫ్ఎస్‌వో నారా పోశెట్టి, ఎఫ్‌బీవో శ్రీకాంత్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అడవిలోని మిగితా పులుల సంరక్షణ జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ చూస్తున్నారు. కాగజ్‌నగర్ దరిగాం, వాంకిడి మండలం సర్కపల్లి అటవీప్రాంతాల్లోకి ఎవరినీ వెళ్లనీయటం లేదు. పొరకలు, బొంగులు కొట్టుకునే వారిని కూడా అటవీ ప్రాంతం లోనికి అనుమంతించడం లేదు. ఐతే వారం రోజుల క్రితం ట్రాప్ కెమెరాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మహారాష్ట్ర నుంచి సిర్పూరు మీదుగా వేంపల్లి, దరిగాం, వాంకిడికి టైగర్ కారిడార్ ఉండటంతో పులులను ట్రాప్ చేసేందుకు కెమెరాలను అమర్చారు. కెమెరాను ధ్వంసం చేయటంతో అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతానికి ఎవరు వచ్చారు? వన్యప్రాణులకు ఏమైనా హానీ జరిగిందా? అనే కోణంలో సమీప గ్రామాల ప్రజలను మళ్లీ విచారిస్తున్నారు. అటవీప్రాంతంలో పులుల జాడ కోసం అన్వేషణ కొనసాగిస్తున్న ఫారెస్టు సిబ్బంది, అధికారులకు ట్రాప్‌కెమెరా ధ్వంసం అయిన విషయం దృష్టికి రాలేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

● ఇంకా ఆచూకీ లభించని రెండు పులులు..

విష ఆహారం తిన్న రెండు పులులు మృత్యువాత పడగా, మిగితా రెండు పులులు ఎక్కడున్నాయనే విషయం ఇంతవరకు తేలలేదు. అసలు బతికి ఉన్నాయా? లేక చనిపోయాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అటవీప్రాంతంలో ట్రాప్‌కెమెరాలు బిగించి వాటి ఆచూకీ కనుగోనేందుకు అధికారులు ప్రయత్నాలు చేశారు. ఇందులో భాగంగా ట్రాప్‌కెమెరా ధ్వంసం అయినట్టు తేలింది. ఈ ట్రాప్ కెమెరాలో పులికి సంబంధించిన ఏదైనా కీలక కదలికల సమాచారం ఉందా..? ఇంకా వేరే కెమెరాలు ఏమైనా ధ్వంసం అయ్యాయా అనే విషయాన్ని అధికారులు వెల్లడించటం లేదు. ట్రాప్ కెమెరా ధ్వంసం చేయడం ఫారెస్టు అధికారులకు సవాలుగా మారిందని అంటున్నారు. అయితే గతంలో పులుల విషయం గోప్యంగా ఉంచినట్లే తిరిగి ట్రాప్‌కెమెరా ధ్వంసం విషయాన్ని రహస్యంగా ఉంచటం కూడా అనుమానాలకు తావిస్తోంది. పులులు మృత్యువాత పడిన ఘటన ఆసిఫాబాద్ డివిజన్ వాంకిడి మండలం సర్కేపల్లి అటవీప్రాంతంలో జరుగగా, కాగజ్‌నగర్ అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై వేటు వేయడంపై అటవీశాఖలోనే చర్చకు తెరలేచింది. వాస్తవంగా ఆసిఫాబాద్ జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్‌లున్నాయి. కాగజ్‌నగర్ డివిజన్ కింద దరిగాం ఉంది. అయితే పులులు మృత్యువాత పడ్డది మాత్రం పక్కనే ఉన్న అటవీ ప్రాంతం అయిన వాంకిడి మండలం సర్కేపల్లి అటవీప్రాంతం. ఇది ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ ఎఫ్‌డీవో పోస్టు ఖాళీగా ఉండడంతో డీఎఫ్‌వో నీరజ్ టీబ్రేవాల్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సర్కేపల్లిలో ఘటనలో ఆసిఫాబాద్ అధికారులపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఈ కోణంలో ఎందుకు విచారణ చేయలేదన్నది కూడా అటవీశాఖలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం


సర్పంచ్‌లను, ఉపసర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

చింతలమానేపల్లి, జనవరి 28: మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను ఆదివారం బాబాసాగర్ రైతు వేదికలో ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు సన్మానించారు. ఈనెల31తో పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా సర్పంచ్‌లను గౌరవంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నానయ్య, జడ్పీటీసీ శ్రీదేవి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, నాయకుడు వెంకయ్య పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చింతలమానేపల్లి, జనవరి 28: మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆదివారం మండలకేంద్రంలోని గాయత్రి విద్యాలయంలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, హరికృష్ణ, దిలీప్, చందు, హరి, తిరుపతి, అంజన్న, శేఖర్, శంకర్, రాజశేఖర్, రాజన్నపాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసానికి రంగం సిద్ధం?

సిర్పూర్(టి), జనవరి 28: సిర్పూర్(టి) మండల పరిషత్ అధ్యక్షురాలు సువర్ణపై అవిశ్వాస తీర్మాణం చేపట్టడానికి ఎంపీటీసీలు రంగంసిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎంపీపీపై తమకు నమ్మకం లేదని సంబంధితశాఖ అధికారులకు దరఖాస్తు చేయనున్నట్లు పలువురు ఎంపీటీసీల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎంపీపీ బీఆర్ఎస్‌కు చెందినవారు కాగా అదేపార్టీకి చెందిన ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టడానికి యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మొబైల్ ఫోన్ అప్పగింత

వాంకిడి, జనవరి 28: ఖమానగ్రామానికి చెందిన చిలువేరి శ్రీనివాస్ రూ.30విలువ చేసే స్మార్ట్‌ఫోన్‌ను రెండునెలలక్రితం పోగొట్టుకున్నాడు. వాంకిడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేయగా సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోను గుర్తించి ఆదివారం బాధితుడికి ఎస్సై సాగర్ అందజేశారు.

ఆదివాసీ బిడ్డల పుణ్యస్థలం జంగుబాయి క్షేత్రం

● నెలరోజుల పాటు జాతర ● పూజలకు తరలివస్తున్న గిరి'జనం'


జంగుబాయి క్షేత్రానికి తరలివచ్చిన ఆదివాసులు

కెరమెరి, జనవరి 28: ప్రకృతినే దైవంగా కొలచే ఆదివాసీలు వారి ఆచారాలు, సంస్కృతీ, సంప్రదాయాలను కొండాకోనల్లోనే నిర్వహించడం ఆనవాయితీ. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న సహ్యాద్రి పర్వతాల్లోని గుహల్లో శార్దూలవాహిని జంగుబాయి కొలువై ఉంది. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి గోండు, పర్దాన్, కొలాం తెగలకు చెందిన ఆదివాసీలు యేటా పుష్యమాసంలో ఇక్కడికి వేలాదిగా తరలివస్తారు. ఈనెల25నుంచి జాతర ప్రారంభం కాగా నెలరోజుల పాటు కొనసాగనుంది.

పుష్యమాసం ఎంతో పవిత్రం..

ఆదివాసీలకు పుష్యమాసం ఎంతో పవిత్రమైనది. ఈ మాసంలోనే గిరిజనులంతా తమ ఆరాధ్య దేవుళ్లను నిష్ఠతో కొలుస్తారు. పుష్యమాసం నెలవంక కనిపించినరోజు నుంచి అమావాస్య వరకు పవిత్రమైన రోజులుగా భావిస్తారు. పాదరక్షలు ధరించరు. మద్యపానానికి దూరంగా ఉంటారు. నేలపైనే నిద్రిస్తారు. అత్యంతనిష్ఠతో పూజలు కొనసాగిస్తారు.

ప్రత్యేక పూజా విధానం..

ఆదివాసీలు తమ దేవుళ్లకు పూజలు చేసేందుకు ఇతర కులాల వారికి అనుమతినివ్వరు. వారిలోనే కొంతమంది పూజారులుగా వ్యవహరిస్తారు. తమ పంటలతోనే దేవుళ్లకు నైవేద్యాన్ని సమర్పిస్తారు. వడ్లను ఇంటివద్దనే రోళ్లలో దంచి సేకరించిన బియ్యాన్ని పూజలో వాడుకుంటారు. నైవేద్యం కోసం గోదుమ పిండి, పప్పు, బెల్లం అవసరం. పురాతన పద్ధతుల్లో తీసిన నువ్వుల నూనెనే వాడతారు. దీపారాధన కోసం నెయ్యి లేదా నువ్వుల నూనె, ఆముదం నూనెను మాత్రమే వాడు తారు. పూజాసామగ్రితో కాలినడకన జంగుబాయి వద్దకు చేరుకుంటారు. రాత్రి పూట దీపారాధన చేసి ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. పుణ్యక్షేత్రం వద్ద తుమ్రం, కొడప, సలాం, రాయిసిడాం, వెట్టి, మరప, హెర్రై కుమ్ర,మండాడి ఎనిమిది గోత్రాల కటోడాలు (పూజారులు) పూజలు చేస్తారు. డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య దీపారాధన చేస్తారు. అక్కడి నుంచి మైసమ్మ,పోచమ్మ, రావుడ్ వద్ద మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం సహపంక్తి భోజనం చేసి దేవుడిపాటలు పాడుతూ అమ్మవారిని ఆరాధిస్తారు. మరుసటిఉదయం సంప్రదాయవాయిద్యాల మధ్యనృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకుంటారు.

మొక్కులు చెల్లించుకున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు..

జంగుబాయి క్షేత్రాన్ని మంత్రితోపాటు ఎంపీ, ఎమ్మెల్యేలు దర్శించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల23న రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క జంగుబాయి క్షేత్రాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆదిలాబాద్ ఎంపీ సోయంబాపూరావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు అమ్మవారిని ఈ నెల 25న దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తునికాకు కల్లాలను రద్దుచేయొద్దు

● బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి


మాట్లాడుతున్న సిడాం గణపతి

కాగజ్‌నగర్, జనవరి 28: అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే తునికాకు కల్లాలను రద్దుచేసే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి అన్నారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. సిర్పూరు నియోజకవర్గంలోని ఏడు కల్లాల యూనిట్లను రద్దు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తమకు తెలిసిందన్నారు. బెజ్జూరు, పెంచికల్‌పేట మండలాల్లోని ఏడు కల్లాల యూనిట్లను రద్దుచేస్తే గిరిజనులకు అపారనష్టం జరుగుతుందన్నారు.

కేవలం పులులు తిరుగుతున్నాయన్న సాకు చూపించి రద్దు చేసేందుకు ప్రతిపాదనలు పంపించటం దారుణమన్నారు. కొన్ని సంవత్సరాలుగా తునికాకు సేకరణ చేస్తుండగా, పులులకు ఎలాంటి హాని కల్పించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తునికాకు కల్లాలను రద్దు చేయవద్దన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు లెండుగురే శ్యాంరావు, నక్క మనోహర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


క్రీడా కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి, జనవరి 28: యువకులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వాంకిడి ఎస్సైసాగర్ అన్నారు. ఆదివారం మండ లంలోని రాజులగూడ గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సంఘ విద్రోహకశక్తులకు సహకరించకుండా చదువుపై దృష్టి సారిం చాలన్నారు. గ్రామీణ, మండలస్థాయి క్రీడల్లో యువకులు తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎదగాలన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

●బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మినారాయణ


మాట్లాడుతున్న ఎండల లక్ష్మినారాయణ

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 28: రాబోయే ఎన్నికల్లో బీజేపి గెలుపుకోసం కార్యకర్తలు కృషిచేయాలని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే ఎండల లక్ష్మినారాయణ పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్‌లోని కిమ్స్ ఆడిటోరియంలో పార్టీజిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన చలో అభియాన్ వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు మరింత చేరువకావాలని సూచించారు. మూడోసారి గెలుపు దిశగా ప్రయాణించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు.కార్యక్రమంలో తాలూకా కన్వీనర్లు, మండలఅధ్యక్షులు, చలోఅభియాన్ మండలకన్వీనర్లు తదితరులున్నారు.

పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ఆసిఫాబాద్, జనవరి 28: జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం టీవీఎస్, టీఏజీఎస్ ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, ఓయూజేఏసీ నాయకులు రాజ్‌కుమార్ ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాందోళనను పోగొట్టేందుకు, ప్రతిభ వెలికి తీసేందుకు ఇటువంటి పరీక్షలు ఉపయోగడపతాయన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు టికానంద్, రాజ్‌కుమార్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

వాంకిడి, జనవరి 28: మండలంలోని బంబార గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా మారాయి. ఆశ్రమపాఠశాల ఆవరణలో ఉన్న చేతిపంపు పైనే విద్యుత్‌తీగలు వేలాడుతున్నాయి. ఈ చేతిపంపు వద్దనే విద్యార్థులు భోజనం చేసిన అనంతరం ప్లేట్లు కడుగుతుం టారు. ప్రమాదవశాత్తు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. రానున్నది వేసవికాలం కావడంతో మార్చి, ఏప్రిల్‌లో వడగాలులకు విద్యుత్‌తీగలు తెగిపడే ప్రమాదం ఉందని విద్యార్థులు భయందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జైపూర్, జనవరి 28: జైపూర్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని బీఎంఎస్ రాష్ట్ర నాయకుడు, జేబీసీసీఐ సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీపీపీలోని కాంట్రాక్టు ఎంప్లాయీస్ వెల్ఫేర్‌అండ్‌ప్రొటెక్షన్ యూనియన్ జనరల్ బాడీసమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యం తన వైఖరిమార్చుకోవాలన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఏబీకేఎంఎస్ జాతీయ కార్య వర్గసభ్యులు పులి రాజారెడ్డి ఎన్నికల అధి కారిగా వ్యవహరించగా నూతన కమిటీని ప్రకటించారు. ఈ కమిటీ కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. నూతన ఎస్టీపీపీ బీఎంఎస్ అధ్యక్షులుగా యాదగిరి సత్తయ్య, వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా సోదరి కృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా దుస్స భాస్కర్, మల్లేష్, మధుకర్, శ్రీనివాస్, సతీష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా అంజిరెడ్డి, శ్రీధర్, సుమన్, సురేందర్, కిషన్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు.

సర్వే మజ్దూర్ పరీక్షలను పరిశీలించిన జీఎం


పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, జనవరి 28: సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సర్వే మజ్దూర్ రాత పరీక్షలను శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి పరిశీలించారు. అనంతరం జవాబు పత్రాలను మూల్యంకనం చేశారు. పరీక్షఫలితాలను సింగరేణిపాఠశాల నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్‌రావు, హెచ్ఎం రాధాకృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల సంఘం ఎన్నికల్లో 150 ఓట్లు పోల్

మందమర్రిటౌన్, జనవరి 28: సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ) సింగరేణి బ్రాంచ్‌ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికలకు సంబంధించి 179 మంది ఓటర్లు ఉండగా 150మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎల్లందుక్లబ్‌లో పోలింగ్‌కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం మందమర్రి ఏరియా జీఎం మనోహర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 11ఏరియాలతోపాటు జైపూర్ పవర్‌ప్లాంట్ అధికారులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. సింగరేణి బ్రాంచ్ తోపాటు కంపెనీవ్యాప్తంగా ఈ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షరేసులో ఉన్న అనుముల వెంకటేశ్వర్ రెడ్డి ఉదయం మందమర్రి పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలించారు. కాగా రాత్రి 8గంటలకు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

నేటి సమావేశాన్ని విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, జనవరి 28: కార్పొరేట్ మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయిన సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, ఎక్స్‌టర్నల్ విధానంలో నియామకం అయిన యువతకు ఉద్యోగ నియామకపత్రాలు వెంటనే అందించాలని సోమవారం సాయంత్రం 5గంటలకు సీసీసీలోని నర్సయ్యభవన్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి షేక్‌బాజీసైదా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగాలు పొంది కొన్ని నెలలుగడిచినా ఇంతవరకు సింగరేణి యాజమాన్యం నియామకపత్రాలు ఇవ్వక పోవడం సరికాదన్నారు. ఇందులో చాలామంది వీటీసీకూడా పూర్తిచేసుకునిఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారన్నారు.సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్రఅధ్యక్షుడు వి సీతారామయ్య, హాజరవుతారని, యువత సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎంపీఎఫ్ ఆన్‌లైన్‌కు కృషి : లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 28: సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ చేయించేందుకు కృషి చేస్తామని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టీబోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీఎంఎస్ కృషి ఫలితంగా నిధుల మళ్లింపు, అవినీతికి తావులేకుండా కార్మికుల మొబైల్‌లో సీఎంపీఎఫ్ డబ్బుల గురించి తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హౌసింగ్ ఫైనాన్స్ నుంచి సీఎంపీఎఫ్‌కు రావాల్సిన సొమ్ము రాబడతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్రఅధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏబీకేఎంఎస్-బీఎంఎస్ కార్యవర్గ సభ్యుడు పులి రాజారెడ్డి, కారంపూడి శ్రీనివాసరాజు, నాతాడి శ్రీధర్ రెడ్డి, రమేష్, అంబేద్కర్, జీడిప్రభాకర్, రాజేందర్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

దండేపల్లి, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.20 లక్షలతో మండలంలోని కాసిపేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.. ఈ కార్యక్రమంలో సర్పంచు యశోద, వైస్‌ఎంపీపీ రాజేందర్, ఏఈపీ ఆర్ విక్రమ్, ఎంపీటీసీలు మల్లవ్వ, రాజన్న, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కార్యవర్గం



ఎన్నికైన చెన్నూరు యూనిట్ సభ్యులు

చెన్నూరు, జనవరి 28: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ చెన్నూర్ యూనిట్ కమిటీని ఆదివారం ఎన్నికల అధికారి పొన్న మల్లయ్య పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజన్న, ఉపాధ్యక్షులుగా స్వామిదాస్, ప్రధాన కార్యదర్శిగా అభిషేక్, సంయుక్త కార్యదర్శిగా రజిత, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎండీ నవీద్ అహ్మద్, ట్రెజరర్‌గా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా సుధాకర్, ఈసీ సభ్యులుగా సయ్యద్ సబీర్, విజయ, మానసలను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యుల పదవీకాలం 3 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. సభ్యులను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి సన్మానించారు.

పోచమ్మ ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక

తాండూర్, జనవరి 28: తాండూర్ కొత్తగుడిసెలలో గల పోచమ్మ ఆలయ పునః నిర్మాణ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలక రాంచందర్, ఉపాధ్యక్షులుగా డోంగ్రి ఆత్మారావు, రాంపెల్లి శంకర్, సిద్ధం రామయ్య, పురంశెట్టి దుర్గయ్య, రాంపెల్లి ఈశ్వరయ్య, గోపాల్, లింగయ్య, గౌరవాధ్యక్షులుగా పుల్లం తిరుపతిరాజ్, సురభి ఆగమరావు, మద్దిబోయిన చిన్న భీమయ్య, జనరల్ సెక్రెటరీలుగా లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, శంకర్, కోశాదికారులుగా వావిలాల రమేష్, పురంశెట్టి అజయ్, హరీష్‌లను ఎన్నుకున్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 28: జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో గల అభయాంజనేయస్వామి రాజరాజేశ్వర సహిత దేవాలయం కమిటీని కౌన్సిలర్ బదావత్ ప్రకాష్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ చైర్మన్‌గా పోరండ్ల సంపత్, సెక్రెటరీగా లింగమూర్తి, వైస్‌చైర్మన్‌గా ఆకుల సంతోష్‌లను ఎన్నుకున్నారు. భూమయ్య, రాజారావు, రాజ్‌కుమార్, మల్లేష్, శంకర్, సారయ్యసూరయ్య, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం కార్యవర్గం

జన్నారం, జనవరి 28 : జన్నారం వర్తక సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వొజ్జల వామన్, ప్రధాన కార్యదర్శిగా జక్కు రమేష్, కోశాధికారిగా శివరామకృష్ణ, ఉపాధ్యక్షులుగా రవి, సుభాకర్, శ్రీనివాస్, రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా చందు, అరవింద్, శ్రావణ్, రాజన్న, కార్యవర్గ సభ్యులుగా సంపత్, శ్రీనివాస్, రాజు, గంగాధర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం వర్తకులు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి



సాయికిరణ్ (ఫైల్)

భీమారం, జనవరి 28: మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన సిడాం సాయికిరణ్ (22) అనే యువకుడు ఆదివారం ప్రమాదశాత్తు కేజ్‌వీల్స్ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మృతి చెందాడు. సిడాం చంద్రయ్య-మల్లక్క దంపతుల పెద్ద కుమారుడు సాయికిరణ్ కేజ్‌వీల్స్ ట్రాక్టర్ ద్వారా పొలం పనులు చేసేవాడు. ఆదివారం ట్రాక్టర్‌ను పొలం ఒడ్డుకు ఎక్కిస్తున్న క్రమంలో బోల్తాపడడంతో ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు.

గోదావరిలో మెస్రం వంశీయుల పూజలు

పవిత్ర గంగాజలంతో తిరుగు ప్రయాణం



గంగాజలం తీసుకుని వెళ్తున్న మెస్రం వంశీయులు



గంగాజలం సేకరిస్తున్న మెస్రం వంశీయులు

జన్నారం, జనవరి 28 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు గోదావరి రేవులోని హస్తినమడుగులో ఆదివారం మెస్రం వంశీయులు పూజలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయంలోని నాగోబాకు హస్తినమడుగు నుంచి గంగాజలం తీసుకువెళ్లి అభిషేకం చేస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 21న కేస్లాపూర్ నుంచి కాలినడకన బయలుదేరిన మెస్రం వంశీయులు 200 మంది ఆదివారం కలమడుగు గోదావరి రేవుకు చేరుకున్నారు. గోదావరి రేవులోని హస్తినమడుగులో స్నానం చేసి అనంతరం పితృదేవతలకు పూజలు చేశారు. నాగోబాకు అభిషేకం చేసేందుకు వెంట తెచ్చిన ఝరి (ప్రత్యేక పాత్ర)లో గంగాజలం సేకరించారు. సహపంక్తి భోజనాలు చేసిన అనంతరం సేకరించిన గంగాజలంతో తిరుగు ప్రయాణమయ్యారు. ఫిబ్రవరి 9వ తేదీన నాగోబా ఆలయానికి చేరుకుని అదే రోజు రాత్రి నాగోబాకు పవిత్ర గంగాజలంతో అభిషేకం చేసిన తర్వాత జాతర ప్రారంభమవుతుందని మెస్రం వంశం ప్రధాన్ దాదారావు, కరోడ మెస్రం కోసురావు, మెస్రం కోసు, కొత్వాల్ హన్మంతరావు, మెస్రం తిరుపతి తెలిపారు.

ఉత్తమ ఆటగాళ్లకు ఉజ్వల భవిష్యత్

ఏసీసీ, జనవరి 28: ఉత్తమ ఆటగాళ్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీసీపీ సుధీర్‌రాంనాధ్‌కేకన్ అన్నారు. పాత మంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో తూముల భీమయ్య చారిటబుల్ ట్రస్టు సహకారంతో జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు ఆదివారం డీసీపీ బహుమతి ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని, ఓటమి వస్తే కుంగిపోవద్దని, గెలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపునకు శ్రమించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారినే గెలుపు వరిస్తుందన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన సింగాపూర్‌కు చెందిన ఎడ్ల రవి జట్టుకు రూ.50 వేల నగదు, ట్రోఫీ, రన్నర్ రజక టీంకు రూ.25 వేల నగదు ట్రోఫీ అందించారు. ఏసీపీ తిరుపతిరెడ్డి, ఓఎంఎస్‌ఈ క్లబ్ గౌరవాధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్, క్లబ్ అధ్యక్షుడు బొలిశెట్టి కిషన్, ప్రధాన కార్యదర్శి ఎర్రం ప్రభాకర్, ఉపాధ్యక్షులు, సింగిల్ విండో డైరెక్టర్ తూముల వెంకటేష్, నాయకులు చిట్ల సత్యనారాయణ, కుంటాల శంకర్ పాల్గొన్నారు.

కవి సమ్మేళనం

ఏసీసీ, జనవరి 28: మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనాన్ని పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దండనాయకుల వామన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమ్మేళనంలో కవి ముత్యాబోయిన మలయశ్రీ, విశ్రాంత తెలుగు పండితుడు కౌటూరి ప్రసాద్‌లు పోతన భాగవతంపై ప్రసంగించారు. నేను అనే అహంకారం వీడితేనే అందరికి భగవంతుడు సాకారం అవుతాడని భాగవతంలో ఉన్న పద్యాలను వివరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, బెల్లాల సుగుణాకర్, భూపతి సంతోష్‌ల సాహితిప్రసంగం అలంరించింది. ఈ సందర్భంగా కౌటూరి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కవులు పాల్గొన్నారు.

అకాల మరణం తీరని లోటు



నివాళులర్పిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమానులు

నస్పూర్, జనవరి 28 : ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్స్ రాజిరెడ్డి, రాఘవరావు, గాజుల రాజయ్యలు అకాల మరణం తీరని లోటని నస్పూర్ ప్రైవేట్ పాఠశాలల సంఘం నాయకులు అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. పాఠశాలల యాజమానులు ముగ్గురు కూడా నాలుగు రోజుల వ్యవధిలో అనారోగ్య సమస్యలతో మృత్యువాత పడ్డారని తెలిపారు. రాజిరెడ్డి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. నస్పూర్ ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్స్ బత్తిని దేవన్న, రేగళ్ళ ఉపేందర్, సబితా సుల్తానా, గోపతి సత్తయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, ఖైదం రామకృష్ణ, కృష్ణారెడ్డి, చెన్నూరి అమన్ ప్రసాద్, మహేందర్, ఇబ్రహిం తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడిగా రమేష్



రమేష్

మందమర్రిటౌన్, జనవరి 28: మందమర్రి ఏరియా సింగరేణి కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంవోఏఐ) అధ్యక్షుడిగా కేకే ఓసీపీ డిప్యూటీ మేనేజర్ సట్యారి రమేష్ విజయం సాధించారు. ఆదివారం రాత్రి ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యింది. రమేష్‌కు 79ఓట్లు, ప్రత్యర్థి శాంతిఖని గ్రూపు ఏజెంటు విజయ్ ప్రసాద్‌కు71 ఓట్లు పోలయ్యాయి. అలాగే జనరల్ సెక్రెటరీగా స్టోర్స్ ఎస్‌ఈ ఫైడీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా జీఎం కార్యాలయంలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్న సుధారాణి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్ వెంకటేశ్వర్లు, నాగవర్ధన్ ఎన్నికయ్యారు. జాయింట్ ట్రెజరీగా సంతోష్, జాయింట్ సెక్రెటరీలుగా డీవై మేనేజర్ రవి, ఆర్ నరేష్ విజయం సాధించారు. వారు మాట్లాడుతూ సంస్థ సంక్షేమంతో పాటు సంఘం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని నూతన అధ్యక్షుడు రమేష్ తెలిపారు.

జైపూర్: ఎస్టీపీపీలో ఆదివారం జరిగిన సీఎంవోఏఐ ఎన్నికల్లో ఎస్టీపీపీలో పనిచేస్తున్న సముద్రాల శ్రీనివాస్ (డీవైఎస్‌ఈ ఈఅండ్ఎం) 12ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు.ఎస్టీపీపీలో మొత్తం ఓట్లు 74ఉండగా ఇందులో 43ఓట్లు శ్రీనివాస్‌కు రాగా, పంతులకు 31ఓట్లు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను అధికారులు అభినందించారు.

జోరుగా ఇసుక దందా



ద్వారక గోదావరి వద్ద తెప్పల ద్వారా తీసుకవచ్చి ట్రాక్టర్‌లో నింపుతున్న ఇసుక

దండేపల్లి, జనవరి 23: గోదావరి నది తీరంలో ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో ఇన్నిరోజులు నదిలో నీటి నిల్వలు ఉండేవి. క్రమక్రమంగా నీటినిల్వలు తగ్గుతున్నాయి. దీంతో నిత్యం గోదావరితీరంలో నుంచి ఇసుకనుతరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నీటిలోఉన్న ఇసుకను తెప్పపైపోసి తాడుతో లాగి ఒడ్డుకు తీసుకువస్తున్నారు. అనంతరం ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు దాడులుచేసిన కొన్నిరోజులు నిలిపివేసి మళ్ళీ రవాణాచేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే జోరుగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఇసుక తరలిస్తే చర్యలు

- సంధ్యరాణి, తహసీల్దార్

గోదావరితీరాల నుంచి ఇసుక తరలింపునకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. అనుమతిలేకుండా ఇసుకతరలిస్తే శాఖపరమైనచర్యలు తీసుకుంటాం.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మందమర్రిరూరల్, జనవరి 28 : పొన్నారం గ్రామంలో మిషన్‌భగీరథ నీరు రావడం లేదని ఆదివారం ఖాళీ బిందెలతో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ నాలుగు రోజులుగా నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. వెంటనే నీరు వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ఏసీసీ, జనవరి 28: శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సిరిసిల్లలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో మంచిర్యాల శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వివిధ జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొనగా మంచిర్యాల శ్రీచైతన్య విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు పాఠశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జోబిన్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజు, పీఈటీ రాజేందర్‌లు అభినందించారు.

అడవులను కాపాడుకునే బాధ్యత అందరిది

● జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్



గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్

సిర్పూర్(టి), జనవరి 28: అడవులను, వన్యప్రాణులను రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్ టిబ్రెవాల్ అన్నారు. ఆదివారం సిర్పూర్(టి)రేంజ్ పరిధిలోని చింతకుంట, భూపాలపట్నం గ్రామాల్లో వన్యప్రాణులు, అడవుల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అడవులను కాపాడుకుం టేనే రాబోయేకాలంలో మనుగడ ఉంటుందన్నారు. వన్య ప్రాణులవేట మానుకోవాలన్నారు. అడవుల్లో కరెంటు తీగలు అమర్చితే మనప్రాణాలకే ముప్పు ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి పనులపై దృష్టి సారించాల న్నారు. ఎస్సై దీకొండ రమేష్ మాట్లాడుతూ అడవుల్లో ఉచ్చులు బిగిస్తే ప్రమాదవశాత్తు వారి ప్రాణాలకు ముప్పు తెస్తుందన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో పూర్ణచందర్‌రావు, ఎఫ్‌ఎస్‌ఓలు సద్దాంహుస్సేన్, ఎఫ్‌బీవోలు రవీనా, సర్పంచ్ మహేందర్ నాయక్, ఎంపీటీసీ మంగిలాల్ తదితరులు ఉన్నారు.

అందని బిల్లులు.. అవస్థల్లో కార్మికులు

● ఐదు నెలలుగా విడుదల కాని డబ్బులు
● గౌరవ వేతనం కూడా అందని పరిస్థితి
● ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు
● పట్టించుకోని అధికారులు



బిల్లులు చెల్లించాలని ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు(ఫైల్)

రెబ్బెన, జనవరి 28: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులకు ప్రతి రోజు భోజనం వండి పెడుతున్న కార్మికులు వంట బిల్లులు రాకఇబ్బందులు పడుతున్నారు. ఆగస్టు నుంచి మధ్యాహ్న భోజనం వంట బిల్లులు, సెప్టెంబరు నుంచి సీఎం బ్రేక్ ఫాస్ట్ బిల్లులు, కోడి గుడ్డు బిల్లులు, ఏడు నెలల నుంచి గౌరవ వేతనాలు చెల్లించలేదు. అప్పులుచేసి మరీ విద్యార్థులకు వండి పెడుతున్నారు మధ్యాహ్న భోజన నిర్వాహకులు. జిల్లాలో మొత్తం 684పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలలు 535, ప్రాథమికోన్నత పాఠశాలలు 98, ఉన్నత పాఠశాలలు 51 ఉన్నాయి. ఇందులో 40,722మంది విద్యార్థులు విద్యనుఅభ్యసిస్తున్నారు.ఆయాపాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు ప్రతిరోజు వంట చేస్తున్నారు. 9,10 విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10.65, 6నుంచి 8తరగతి విద్యార్థులకు రూ.8.65, 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు రూ.6.85 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. కానీ సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ఐదు నెలల నుంచి వంటబిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితోపాటు ఇటీవల సీఎం బ్రేక్‌ఫాస్ట్ పేరుతో ఉదయం టిఫిన్ కోసం ఒక్క విద్యార్థికి రూ.10.50లు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు కూడా బిల్లులు రాలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట సామగ్రి కిరాణి దుకాణంలో ఉద్దెర తీసుకొస్తున్నామన్నారు. దుకాణాల్లో డబ్బులు కట్టనిదే సరుకులు ఇవ్వడం లేదని వాపోతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు గౌరవ వేతనాలు, భోజన బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 1375మంది మధ్యాహ్న భోజన వంట కార్మికులున్నారు. ప్రస్తుతం కూరగాయాలు ధరలు పెరగాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చెల్లించే డబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాలు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి..

-బి.ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి



పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు తెచ్చి వంటలు వండి పెడుతున్నారు. అధికారులు, నాయుకులు వెంటనే స్పందించి బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పోరుబాట పట్టాల్సి వస్తుంది.

బిల్లులు చేసి పంపించాం..

-ఎంఈవో స్వామి, రెబ్బెన



మండల పరిధిలోని మధ్యాహ్న భోజన కార్మికుల తాలుకూ బిల్లులను ప్రభుత్వానికి పంపించాం. బిల్లులు క్లియర్స్ కావాల్సి ఉంది. బిల్లులు క్లియరెన్స్ అయి డబ్బులు రాగానే కార్మికులకు చెల్లిస్తాం.

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యులే కీలకం: ఎస్సై



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై విక్రం

బెజ్జూరు, జనవరి 28: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యులే కీలకమని ఎస్సై విక్రం అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఆర్‌ఎంపీల భవనంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఆర్‌ఎంపీ వైద్యుల సేవలు విస్తరించాలని సూచించారు. పేదలకు ఉచితవైద్యం అందించేందుకు ముందుండాలని అందుకోసం పోలీసుల సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆసంఘం మండలాధ్యక్షుడు ఇబ్రహీం, వర్కింగ్ ప్రెసి డెంట్ సురేందర్, భాస్కర్, రమేష్ యాదవ్, బాపురావు, విశ్వనాథ్, సత్యనారాయణ, యాదగిరి, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, జావీద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద వైష్ణవులను ఆదుకోవాలి

● జిల్లా కమిటీ సభ్యుడు డింగరి రవికుమార్

ఇల్లందకుంట, జనవరి 28: రాష్ట్రంలోని నిరుపేద శ్రీవైష్ణవులను ఆర్థికంగా ఆదుకోవాలని వైష్ణవ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు డింగరి రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణంలో ఆదివారం శ్రీవైష్ణవ సేవా సంఘం ఏర్పాటు చేసి 25ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డింగరి రవికుమార్ మాట్లాడుతూ శ్రీవైష్ణవి సేవా సంఘం పేద వైష్ణవులకు ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు.

అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న పేద వైష్ణవులకు ఆర్థిక, వైద్య, విద్యపరంగా ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అందులో నిరుపేద వైష్ణవులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. .కార్యక్రమంలో డింగరిశ్రీధర్, సముద్రాల ప్రసాదచార్యులు, సముద్రాల సుదర్శనాచార్యులు, శేషం రామాచార్యులు, శేషం వంశీధరాచార్యులతో పాటు 350 మంది పాల్గొన్నారు.

సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలి



దండేపల్లి, జనవరి 28: సర్పంచుల పదవీకాలాన్ని పొడిగించాలని ఆదివారం మంచిర్యాల సర్పంచుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గడికొప్పుల రజని హైదరాబాద్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డిలకు వినతిపత్రం అందించారు. పదవీ కాలం వచ్చే నెల1న ముగుస్తుందన్నారు. సర్పంచు ఎన్నికలు జరిపే వరకు పదవీకాలాన్ని పొడగించాలన్నారు. దీనికి మంత్రులు సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూమన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింగ్

శ్రీరాంపూర్, జనవరి 28 : జాతీయ మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా జింజుపల్లి నర్సింగ్ నియమితులయ్యారు. ఆయనకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితం శంకర్ రావు, అధికార ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్, జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, జై భీమ్ రాష్ట్ర కన్వీనర్ ఆశాది పురుషోత్తం ఆదివారం మంచిర్యాలలో నియామక పత్రం అందజేశారు. గతంలో విద్యార్థి, యువజన, ప్రజా పోరాటాలలో నర్సింగం చురుగ్గా పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల నరేష్, కార్యదర్శి నాగుల దుర్గయ్య, ప్రచార కార్యదర్శి సొల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ఆడాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

చింతలమానేపల్లి, జనవరి 28: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ఆదివారం మండలంలోని బాబాసాగర్ గ్రామంలో స్వర్గీయ సయ్యద్ సాబీర్‌హుస్సేన్ స్మారక తాలూకాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నానయ్య, జడ్పీటీసీ శ్రీదేవి, కోఆప్షన్ సభ్యుడు నాజీంహుస్సేన్, ఎంపీ టీసీ రాజన్న, ఉపసర్పంచ్ భాస్కర్, నాయకులు నారాయణ, మారుతి, ప్రసాద్, భీంరావు, గోపిదాస్, వెంకటేష్, కార్యదర్శి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొజ్జును కలిసిన విద్యార్థి ఉద్యమ నేతలు

నస్పూర్, జనవరి 28: నస్పూర్‌కు చెందిన తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకులు ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జును ఉట్నూర్‌లో స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలి శారు. విద్యా రంగంలో, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిం చారు. అంబేద్కర్ చిత్రపటాన్ని బహు కరించి సన్మానించారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకులు చంద్రగిరి నరేష్ అనపర్తి యువరాజ్, కొదురుపాక నరేష్, కొల్లూరి రవి కుమార్, వేల్పుల రాజేశ్, దుర్గం లింగారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జైపూర్, జనవరి 28 : క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసం లభిస్తుందని ముదిగుంట మాజీ సర్పంచ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన మాజీ కేంద్రమంత్రి కాకా వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ పోటీల్లో ముదిగుంట జట్టు గెలుపొందగా నగదు బహుమతి రూ. 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చిప్పకుర్తి సంపత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


నాగంపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రేంజర్ రవి

కోటపల్లి, జనవరి 28: అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని కోటపల్లి అటవీ శాఖ రేంజర్ రవి అన్నారు. ఆదివారం సర్వాయిపేట, నాగంపేట, కొండంపేట, జనగామ, ఎర్రాయిపేట గ్రామాల్లో స్మగ్లర్లు, వేటగాళ్ల ఇండ్లలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలతో అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అడవుల్లో చెట్లను కొట్టవద్దని, వన్య ప్రాణులను సంరక్షించాలని, వేట సాగించవద్దన్నారు. ఎవరైనా జంతువులకు హాని తలపెడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. బీట్ అధికారులు సాగర్, సత్యనారాయణ, నరేష్, నదీమొద్దీన్, ప్రసన్నరాణి, లత, కోటపల్లి బేస్ క్యాంపు సిబ్బంది శ్రీనివాస్, సాగర్, సంపత్, అశోక్, నవాజ్, రషీద్‌లు పాల్గొన్నారు.

టీఎస్ఎండీ అధికారుల ఆకస్మిక తనిఖీలు


వే బిల్లు పరిశీలిస్తున్న అధికారులు

కోటపల్లి, జనవరి 28: మండలంలోని కొల్లూరు ఇసుక రీచ్‌ను, ఇసుక లారీలను ఆదివారం టీఎస్ఎండీ అధికారులు తనిఖీలు చేశారు. వే బిల్లులు, తూకం కేంద్రాలను పరిశీలించారు. ఓవర్‌లోడ్ రవాణా చేయవద్దని సూచించారు. లారీ డ్రైవర్లు ఖచ్చితమైన ఇసుక లోడ్ ధ్రువీకరణ పత్రాల తో రవాణా చేయాలని ఆదేశించారు. పత్రాలు లేని అధిక లోడ్‌తో వెళ్లే లారీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ప్రాజెక్టు అధికారి తారక్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది అభినవ్, నరేష్, పాషా, బార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

నెన్నెల, జనవరి 28: నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 3న ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకులు మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖైలారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని కార్పొరేటు రంగాలకు అప్పజెపుతుందన్నారు. జిల్లాకు ఒక యూనివర్సిటీని నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలను తెరిపించాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు మహేష్, గంగన్న, వినోద్, భూమేష్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న పసుల రాంమూర్తి


హాజీపూర్, జనవరి 28: ఎస్సీ వర్గీకరణ చేపట్టవద్దని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి అన్నారు. ఆదివారం హాజీపూర్‌లో మాలమహానాడు ఆఫ్ ఇండియా ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో ఓటు రాజకీయాన్ని చేసి దళితు లను విభజించడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మాలల హక్కుల సాధనకు పోరాటాలు చేయాలన్నారు. మాలలందరు ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలన్నారు. సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిష్టయ్య, కార్యదర్శి జూపాక ధర్మయ్య, పుల్లయ్య, యాదగిరి, వెంకటయ్య, ధర్మయ్య, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, దినేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్య అధ్యయనానికి కమిటీని నియమించాలి


మాట్లాడుతున్న జాడి రాజన్న

జన్నారం, జనవరి 28: పాఠశాల విద్య అధ్యయానికి నిపుణులతో కూడిన కమిటీని నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న కోరారు. ఆదివారం జన్నారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పాఠశాల విద్యా స్థితిగతులను తెలుసుకుని విద్యను బలోపేతం చేయాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు ప్రత్యేకంగా ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గోపాల్, మల్లేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రిషియన్స్ డే


కేక్ కట్ చేస్తున్న ఎలక్ట్రిషియన్లు

చెన్నూరు, జనవరి 28: చెన్నూరు పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రిక్ టెక్నిషియన్ భవనంలో ఆదివారం ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నిషియన్ ఫెడరేషన్ చెన్నూరు పట్టణాధ్యక్షుడు సఫ్దర్ కేక్ కట్ చేశారు. నాయకులు శ్రీనివాస్, కరీం, గట్టు, సృజన్, కబీర్, రాజేష్‌లు పాల్గొన్నారు.

ఆశలు చిగురించేనా?




మామిడి చెట్టుకు సోకిన ఆకు జల్లెడ తెగులు

- పూతకు వస్తున్న మామిడి తోటలు
- ప్రతికూలంగా వాతావరణం
- మబ్బులు, పొగమంచుతో దిగులు
- యాజమాన్య పద్ధతులు పాటించాలని నిపుణుల సూచన

నెన్నెల, జనవరి 28: మామిడి తోటలు ఆలస్యంగా పూతకొస్తున్నాయి. జనవరి ఆఖరి వారానికల్లా పూర్తి స్థాయి పూత రావాల్సి ఉండగా 40 శాతం చెట్లే పూత పట్టాయి. నాలుగేళ్ల వరసగా నష్టాలు మూటగట్టుకున్న జిల్లా మామిడి రైతులు ఈ సీజన్‌పై ఆశలు పెంచుకున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు రైతులకు ఒకింత ఆందోళన కలిగిస్తున్నాయి. రోజుల తరబడి మబ్బులు పట్టి, పొగమంచు కమ్ముకుంటుండటంతో చీడపీడల దాడి ఉధృతమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది తీవ్రంగా నష్టపరిచిన పండు ఈగ ఉనికి కలవర పెడుతోంది. చీడపీడల నుంచి రక్షించుకునేందుకు వేల రూపాయలు ఖర్చు పెట్టి మందులు పిచికారి చేస్తున్నారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి పూతను సంరక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

పూతకు రాని తోటల్లో

పూత వచ్చే సమయంలో వాతావరణ పరిస్థితులు అధిక ప్రభావాన్ని చూపుతాయి. ఎంత చలి ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. రాత్రి పూట 15 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే మెరుగైన ఫలితాలుంటాయి. పూత దశలో నీటి తడులు నిలిపి వేసి బెట్ట పరిస్థితులు కల్పిస్తే శాఖీయ పెరుగుదల నిలిచిపోయి మొక్కకు తగినంత విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల చెట్టు పూత సమయానికి సరిపడ పిండి పదార్థం నిల్వ చేసుకోవడమే కాకుండా కొమ్మలు పూర్తి పక్వతకు చేరుకుని ఎక్కువ పూత రావడానికి దోహదపడతాయి. పూమొగ్గ ఏర్పడిన తరువాత నీటి తడులిచ్చి పైపాటుగా ఎరువులు వేసుకోవాలి. చెట్టు వయసును బట్టి సాధారణంగా 500 గ్రాముల నుంచి ఒక కిలో యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి. పూత బటాని గింజ సైజు అయ్యేంత వరకు మందులు పవర్ స్ప్రేయర్‌తో పిచికారి చేస్తే పూత రాలిపోయే అవకాశం ఉంది. ఇంకా పూత కనబడని చెట్లపై మల్టీకె 10 గ్రాములు, యూరియా 5 గ్రామలు ఒక లీటరు నీటికి కలిపి చెట్టుపై పిచికారి చేయాలి. బోరాన్ లోపం ఉన్న తోటల్లో బోరాక్స్ 2 గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి స్ప్రే చేస్తే పిందెకట్టు పెరుగుతుంది. పూత సమయంలో తేనె మంచు పురుగు, తామరు పురుగు, ఆకుచుట్టు, పూత చుట్టు, పిండి నల్లి పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. అవి ఆశించినట్లు గుర్తించిన వెంటనే తగిన మందులు స్ప్రే చేసుకోవాలి.

పూత దశనే కీలకం

మామిడి పంటలో పూత దశనే కీలకం. సున్నితమైన ఈ దశలో తగిన చర్యలు చేపట్టి పూతను రక్షించుకుంటేనే ఆశించిన దిగుబడి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులంటున్నారు. తెగుళ్లపై అవగాహన పెంచుకుని వాటిని గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

పూత సమయంలో తేనె మంచు పురుగు, తామరు పురుగు, ఆకుచుట్టు, పూత చుట్టు, పిండి నల్లి పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. ఆకుజల్లెడ పురుగు (బల్లి పాతర) చెట్లపై లేకుండా చూసుకోవాలి. తెగుళ్ల ఆశించినట్లు గుర్తించిన వెంటనే తగిన మందులు స్ప్రే చేయాలి.

ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్ల కూడా మామిడి చెట్లపై దాడి చేస్తాయి. ఈ తెగుళ్ల వల్ల దిగుబడిపై ప్రభావం పడుతుంది. సస్యరక్షణ చర్యలు చేపడుతూనే ఎండలు ముదురుతున్నా కొద్ది క్రమం తప్పకుండా నీటి తడులు ఇస్తే మామిడిలో పూత, పిందె రాలకుండా ఉంటుంది.

● 19 వేల ఎకరాల్లో సాగు

జిల్లాలో 19 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. నెన్నెల, జైపూర్, భీమారం, చెన్నూరు, తాండూర్, మందమర్రి, బెల్లంపల్లి మండలాల్లోనే ఎక్కువ శాతం తోటలు ఉన్నాయి. దేశంలో లభించే అన్ని రకాల మామిడి పండ్లు ఇక్కడ లభ్యమవుతాయి. బంగినపల్లి, దసేరి, లంగ్డా, చెరుకురసాలు, తోతాపరి, పంచదార, సుందరి, పొనాస, నీలం, కొత్తపల్లి కొబ్బరి లాంటి వందకు పైగా వివిధ రకాల మామిడి పండ్లు ఈ ప్రాంతంలో సాగవుతాయి. నాణ్యతలో ఇక్కడి మామిడిపండ్లు నంబర్ వన్‌గా నిలుస్తాయి. బంగారు వర్ణంలో నిగనిగలాడుతూ మధురమైన రుచిని కలిగి ఉండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. నిల్వ సామర్థ్యం కూడా ఎక్కువే. దీంతో ఇక్కడి మామిడి కాయలకు దేశంలోని పలు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటుంది.

పూతను సంరక్షించుకోవాలి

-సీహెచ్. సుప్రజా, బెల్లంపల్లి క్లస్టర్, ఉద్యాన శాఖ అధికారి



ప్రస్తుతం మామిడి తోటలు పూతకు వస్తున్నాయి. వచ్చిన పూతలో ఎక్కువ శాతం పింద కట్టకుండానే రాలిపోతుండటంతో ప్రతీ సీజన్‌లో రైతులు నష్టపోతున్నారు. మామిడి పూతలో ప్రతి పూల గుత్తిలో 4 వేల నుంచి 6 వేల పూలుంటాయి. ఇవన్ని మగపూలే కాగా ఇందులో 1-3 పూలే కాయగా వృద్ధి చెందుతాయి. పూత సంరక్షణలో వాతావరణ పరిస్థితులు, నీటి, పోషక యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల బెడద, హార్మోన్ల లోపాలు ప్రధాన భూమిక పోషిస్తాయి. తెగుళ్లను గుర్తించి మందులు స్ప్రే చేసుకోవాలి. సమగ్ర యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపడితే పూతను రక్షించుకొని, ఆశించిన దిగుబడులు సాధించవచ్చు. ఎలాంటి సమస్యలున్నా ఉద్యాన అధికారులను సంప్రదించాలి. తోటలను సందర్శించి సలహాలు, సూచనలిస్తాం.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జనవరి 28 : విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్ల స్పెషల్ ఆఫీసర్‌లతో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్‌లతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల పరిపుష్టతకు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడమే లక్ష్యంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు వెళ్తామన్నారు. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపిన సమస్యలను విని తన స్థాయిలో ఉన్నవాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని, విద్యార్థుల్లో డ్రాపౌట్స్‌ను తగ్గించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకొంటామన్నారు. సమావేశంలో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానన్నారు. డీఈవో యాదయ్య, లక్సెట్టిపేట, మంచిర్యాల ఎంఈవోలు రవీందర్, పోచయ్య, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, యశోదర పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు


రవీందర్


బన్సీలాల్


సుధాకర్

చెన్నూరు, జనవరి 28: చెన్నూరు స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఆదివారం కె.రవీందర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన వాసుదేవరావు ఐజీ ఆఫీస్‌కు బదిలీ కాగా, సిరిసిల్ల సీసీఎస్‌లో సీఐగా పనిచేసిన రవీందర్ చెన్నూరు సీఐగా ప్రభుత్వం బదిలీ చేసింది. స్టేషన్ సిబ్బంది సీఐకి స్వాగతం పలికారు.

శ్రీరాంపూర్, జనవరి 28 : శ్రీరాంపూర్ సీఐగా ఆర్. బన్సీలాల్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన బెల్లంపల్లి-1 టౌన్ నుంచి శ్రీరాంపూర్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసిన గంగాధర రమేష్ బాబు రామగుండం ఎస్‌బి-4కు బదిలీ అయ్యారు.

కోటపల్లి, జనవరి 28: చెన్నూరు రూరల్ సీఐగా సుధాకర్ కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన విద్యాసాగర్ బదిలీపై ఐజీ కార్యాలయానికి వెళ్లగా ఆయన స్థానంలో పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ కోటపల్లికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు సంకష్ట పూజలు

నస్పూర్, జనవరి 28: నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలో గల లక్ష్మి గణపతి దేవాలయంలో ఈ నెల 29న సోమవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని 108 కిలోల ఎండు ద్రాక్ష పండ్లతో మహాద్రాక్ష ఫలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు, ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, గణపతి హోమం ఉంటాయన్నారు. సాయంత్రం స్వామి వారికి మహాద్రాక్ష ఫలాభిషేకం ఉంటుందన్నారు. అభిషేకం అనంతరం పురవీధుల్లో పల్లకి సేవ, అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

జన్నారం, జనవరి 28 : మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో 1998 కానిస్టేబుల్ బ్యాచ్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్ రిటైర్డు ఐజీపీ ఎంకే సింగ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విధుల్లో విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేసే ఉద్యోగికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల అభివృద్ధికి కృషి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జనవరి 28: క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎస్ఆర్ జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారుల కోసం నిధులు కేటాయించి స్టేడియాలు నిర్మించడంతోపాటు క్రీడాకారులకు కోచింగ్, స్పాన్సర్‌షిప్, టోర్నమెంట్‌ల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. యువత క్రీడల్లో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి 1500 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జగన్ మోహన్, రాజన్న, రాజు, అనిల్, రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, జాతీయ సంయుక్త కార్యదర్శి నరేందర్, సాయికుమార్, రాజిరెడ్డి, పాపయ్య మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేతేశ్వర కంకాలమ్మ జాతర


దర్శనం చేసుకుంటున్న జాన్సన్ నాయక్

జన్నారం, జనవరి 28: మండల కేంద్రంలోని ఈర్లగుట్టపై వెలిసిన కేతేశ్వర కంకాలమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జాతరను నిర్వహిస్తున్నారు. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పలు జిల్లా, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డిలు జాతరలో పాల్గొన్నారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు నర్సింగరావు, కోడిజుట్టు రాజన్న, నర్సయ్యలు ఘనంగా సన్మానించారు. ఈ జాతరకు పెద్ద సంఖ్యలో మహేంద్ర కులస్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసినవే


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్‌రావు

ఏసీసీ, జనవరి 28 : మంచిర్యాల నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసినవేనని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తాగునీటి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం రూ. 70 కోట్లు మంజూరు చేసిందని, ఆ నిధులతో మంచిర్యాల మున్సిపాలిటీలో అండాళమ్మ కాలనీ, వేములపల్లి, చున్నంబట్టి వాడల్లో ట్యాంకులు నిర్మించినట్లు తెలిపారు. అటవీశాఖ అనుమతుల కోసం తాను కృషి చేశానన్నారు. కొత్త పైపులైన్‌ల నిర్మాణానికి మంచిర్యాల మున్సిపాలిటీలో గతంలోనే రూ. 40 కోట్లు మంజూరు చేయించానన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వల్లనే మిషన్ భగీరథ నీరు మంచిర్యాల, తదితర ప్రాంతాలకు సరఫరా అవుతుందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు మంజూరు కావడానికి తన కృషే కారణమన్నారు. గూడెం లిఫ్ట్ పంపులు వరద నీటిలో మునిగితే రూ.11 కోట్లతో మరమ్మతు చేయించానని తెలిపారు. ఎంఎస్ పైపులు వేయించడం వల్లనే రెండో పంటకు ప్రస్తుతం నీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో క్వింటాళుకు రూ. 500 బోనస్ ఇస్తానని చెప్పి మొండి చేయి చూపించిందన్నారు. మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసి టెండర్లు పూర్తయిన 800 పైచిలుకు పనులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుదల చేసిందని విమర్శించారు. పనులు ఎందుకు నడవడం లేదో ప్రజలకు తెలపాలని, త్వరలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ వస్తుందని, వేసవిలో నీటి సమస్య వల్ల క్యూరింగ్ కష్టమవుతుందని తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మంచిర్యాల అంతర్గాంను కలుపుతూ గోదావరిపై బ్రిడ్జిని మంజూరు చేయిస్తే ఎందుకు పనులు ప్రారంభించడం లేదో చెప్పాలన్నారు. కాంగ్రెస్ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను ప్రలోభాలకు గురి చేసి గెలిచిందన్నారు. రాళ్లవాగుపై రంగపేటకు వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేయించానని, ఈ పనులు కూడా ప్రారంభించడం లేదన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, నాయకులు , కౌన్సిలర్లు పాల్గొన్నారు.